క్లుప్తంగా

పట్టాలు ఇప్పించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ముస్తాబాద్‌: మండలంలని ముస్తఫానగర్‌లో కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పించాలని కలెక్టర్‌ సందీప్‌కుమార్‌ ఝాకు రైతులు సోమవారం విజ్ఞప్తి చేశారు. భూములను చదును చేసి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు పట్టాలిచ్చి ఆదుకోవాలని కోరారు. మాజీ ఉపసర్పంచ్‌ శివరాత్రి నర్సయ్య, బండ రమేశ్‌, చంద్రయ్య, విఠల్‌ తదితరులున్నారు.

అనంతగిరికి నీటి విడుదల

బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర (మిడ్‌మానేరు) ప్రాజెక్టు నుంచి అనంతగిరి ప్రాజెక్టు ప్యాకేజీ–10కు సోమవారం నీటి విడుదల చేశారు. అనంతగిరికి 6,400 క్యూసెక్కులు, కుడి కాల్వకు 100 క్యూసెక్కుల మేర నీరు తరలుతోంది. ఎల్లంపల్లి నుంచి వరదకాల్వ మీదుగా మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి 3,150 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో వస్తోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టులో 16.49 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

ఇల్లంతకుంట: మధ్యమానేరు నుంచి డి3 కుడి కెనాల్‌ ద్వారా నీటిని విడుదల చేశారు. దీంతో కందికట్కూర్‌ , వంతడ్పుల, జవారిపేట, నర్సక్కపేట, పాండలాపురం, వల్లంపట్ల, తదితర గ్రామ రైతులకు ప్రయోజనం కలుగనుంది.

వాహనాల తనిఖీ



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలో ఎస్సై రమాకాంత్‌ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. పెండింగ్‌ చలాన్లు ఉండొద్దని సూచించారు. వాహన రిజిస్ట్రేషన్‌, బీమా ఉండాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రిపుల్‌ డ్రైవింగ్‌ చేయరాదని సూచించారు. ధ్రువీకరణపత్రాలు సరిగ్గా లేని 30 వాహనాల యజమానులకు జరిమానా విధించారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలో సోమవారం సాయంత్రం ఎస్సై శ్రీకాంత్‌ గౌడ్‌ ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్సై మాట్లాడుతూ ఆగసస్టు 15 సందర్భంగా ముందస్తుగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని, వాహనాల తనిఖీ, డ్రంకెన్‌ డ్రైవ్‌ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు. పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

కోనరావుపేట: నిరుపేదలకు సీఎం సహాయ నిధి వరంలా మారిందని కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు షేక్‌ ఫిరోజ్‌ పాషా అన్నారు. మండలంలోని కనగర్తిలో జాలుగం గీతకు రూ.60వేలు చేపూరి విజయకు రూ.31వేలు భీమని మహేశ్‌కు రూ.28,500, పులి లతకు రూ.19వేల విలువైన సీఎంరిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. సీఎంఆరఎఫ్‌తో నిరుపేదలకు భరోసా కలుగుతుందన్నారు. మండల నాయకులు తాళ్లపెల్లి ప్రభాకర్‌ నాయిని ప్రభాకర్‌రెడ్డి, బొర్ర రవీందర్‌, బోయిని దేవరాజు, గ్రామనాయకులు వంగపెల్లి దేవరాజు, మారుపాక శంకర్‌, జిల్లెల్ల లక్ష్మారెడ్డి, మహిపాల్‌ రెడ్డి, బత్తుల ముత్తయ్య, అనిల్‌, లింగం, సతీశ్‌, తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ సంచారం..



విద్యానగర్‌లో తిరుగుతున్న కొండచిలువ

సిరిసిల్లటౌన్‌: పట్టణంలో ఇరవై రోజులుగా కొండచిలువ సంచారం స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తుంది. శ్మశాన వాటికలో ఆవాసం ఏర్పాటు చేసుకొని రోజూ విద్యానగర్‌ తాగునీటి ట్యాంకు వద్దకు వస్తుందని సిరిసిల్ల సంక్షేమ సమితి సభ్యుడు బియ్యంకార్‌ శ్రీనివాస్‌ తెలిపారు. చుట్టుపక్కల నివాసగృహాలు, సమీపంలోనే నెహ్రూపార్కు ఉందని అధికారులు కొండచిలువను పట్టుకొని అడవిలో వదిలేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

కార్గో సేవలను విస్తరిస్తాం

ముస్తాబాద్‌: మండలంలోని కొత్తపల్లిలో కార్గో లాజిస్టిక్‌ సేవలను మార్కెటింగ్‌ ఎగ్జిక్యూటివ్‌ శేఖర్‌ సోమవారం ప్రారంభించారు. వినియోగదారుల సౌకర్యార్థం కార్గో సేవలను విస్తరిస్తున్నామన్నారు. ఈ ప్రాంత ప్రజలు కార్గో లాజిస్టిక్‌ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మోటాటి శ్రీనివాస్‌, ప్రవీన్‌, మహేందర్‌, శ్రీనివాస్‌రెడ్డి, దేవయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

సిరిసిల్లటౌన్‌: జిల్లా కలెక్టరేట్‌ ముందు సోమవారం నిరసనలు హోరెత్తాయి. జిల్లావ్యాప్తంగా మండలాల నుంచి పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బాధితులు నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలి



మండపెల్లి పరిధిలోని కేసీఆర్‌ నగర్‌ డబుల్‌ బెడ్‌ రూం ఇండ్లు నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలి. పలుసార్లు ప్రజావాణిలో నివేదించాం. మా కాలనీల్లో సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రత్యేక గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలి. గత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు చేస్తామని పాలకులు, అధికారులు ఇచ్చిన హామీని నెరవేర్చాలి.

ఇళ్లు నిర్మించాలి ఇవ్వాలి



వేములవాడ మండలం రుద్రవరం నక్కల కాలనీలో 30ఏళ్ల క్రితం 63 కుటుంబాలకు ప్లాట్లు ఇచ్చారు. అక్కడే గుడిసెలు వేసుకొని నివసిస్తున్నాం. ఇంకా 22 కుటుంబాలకు ప్లాట్లు ఇవ్వలేదు. అర్హులకు ప్లాట్లు ఇచ్చి అందరికీ ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కాలనీవాసులు కోరారు.

పెన్షన్‌ ఇప్పించాలి



మాది వేములవాడ మండలం రుద్రవరం. ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రగా యాలయ్యాయి. ఒక కాలు తీసేశారు. ఏమి పనిచేసుకోలేని స్థితిలో ఉన్నా. దివ్యాంగుల కోటాలో పెన్షన్‌, టూవీలర్‌ ఇప్పించాలి. ఏదైనా ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలి. ఇంతకు ముందు పలుసార్లు దరఖాస్తులు అందించా.

– పార్వతి శ్రీనివాస్‌, దివ్యాంగుడు

ఉద్యోగం ఇచ్చి ఆదుకోండి

ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌ గ్రామానికి చెందిన డబుల్‌ బెడ్‌ రూం కాలనీలో నివాసం ఉంటున్నాం. రెండేళ్ల క్రితం మా రెండేళ్ల పాప సెప్టిక్‌ ట్యాంక్‌లో పడి మృతి చెందింది. అప్పటి మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నా భార్య మమత బీఈడీ పూర్తిచేసింది. తనకు ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ మమ్మల్ని ఆదుకోవాలి.

– ఇమ్మడిశెట్టి మమత– వెంకటేశ్‌

మత్తు పదార్థాల నిర్మూలనకు కృషిచేయాలి



తంగళ్లపల్లి: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సిరిసిల్ల రూరల్‌ సీఐ మొగిలి



ముస్తాబాద్‌: మాట్లాడుతున్న ఎస్సై గణేశ్‌

తంగళ్లపల్లి: మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సిరిసిల్ల రూరల్‌ సీఐ మొగిలి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో నిషా ముక్త్‌ భారత్‌ అభియాన్‌ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై రమాకాంత్‌ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్‌ వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు సహకరించాలన్నారు. మత్తు పదార్థాలను ప్రభుత్వం పూర్తిగా నిషేధించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం అధికారి పర్శరాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబాద్‌: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని ఎస్సై గణేశ్‌ అన్నారు. మండలంలోని పోతుగల్‌ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిషా ముక్త్‌ భారత్‌పై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్‌, మద్యం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మత్తుకు బానిసలుగా మారి, విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాధాకిషన్‌రావు, ఉపాధ్యాయులు, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్‌

ముస్తాబాద్‌: మండలకేంద్రంలోని ఇటీవల పలువురు మృతిచెందగా బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ సోమవారం పరామర్శించారు. బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకుడు ముక్క మల్లయ్య కుమారుడు కృష్ణ అనారోగ్యంతో మృతిచెందగా, మల్లయ్యను పరామర్శించారు. బీఆర్‌ఎస్‌ నాయకుడు గుండెల్లి రాములు తల్లి అనారోగ్యంతో మృతిచెందగా రాములును, బీఆర్‌ఎస్‌ నాయకుడు ఆనందరావు తండ్రి మృతిచెందగా, ఆనందరావును పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాని తెలిపారు. ముక్క మల్లయ్యకు రూ.50వేలు కేటీఆర్‌ ఆర్థికసాయంగా అందజేశారు. ఇక్కడ బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణాధ్యక్షుడు నర్సింహా రెడ్డి, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు చంద్రశేఖర్‌రావు, సర్వర్‌, నల్లనర్సయ్య, సంతోష్‌రావు, స్వామి, శెరయ్య తదితరులున్నారు.

కేటీఆర్‌ను కలిసిన సింగిల్విండో వైస్‌ చైర్మన్‌

తంగళ్లపల్లి: సిరిసిల్ల సింగిల్విండో వైస్‌ చైర్మన్‌, బీఆర్‌ఎస్‌ నాయకుడు ఎగుమామిడి వెంకట రమణా రెడ్డి సోమవారం మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిశారు. నియోజకవర్గ పర్యటనలో ఉన్న కేటీఆర్‌ను కలిసి మండల అభివృద్ధిపై చర్చించారు. బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు పడిగెల రాజు, కందుకూరి రామాగౌడ్‌ తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరణ



తంగళ్లపల్లి: మండల తహసీల్దార్‌ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నాయబ్‌ తహసీల్దార్‌ జయంత్‌ కుమార్‌ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన వెంటకలక్ష్మీ ఇటీవల బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా జయంత్‌ కుమార్‌ చార్జి తీసుకున్నారు. ఆయనకు చింతలఠాణా మాజీ సర్పంచ్‌ రంగు శ్రీనివాస్‌, మాజీ ఎంపీటీసీ బోయిని శ్రీనివాస్‌లు పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎమ్మార్పీఎస్‌ విజయోత్సవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్‌ నాయకులు

సిరిసిల్లటౌన్‌: ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ జరిగిందని వక్తలు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం సిరిసిల్లలో వర్గీకరణ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధ్యక్షుడు కానాపురం లక్ష్మన్‌, ఆవునూరు ప్రభాకర్‌, గుండా థామస్‌, కత్తెర దేవదాసు, వెంకటరాములు, పంగ రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బోయినపల్లి: మండలంలోని బూర్గుపల్లికి చెందిన గంగిపెల్లి తిరుపతి ఇటీవల దుబాయిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. అనంతరం రూ. 10వేలు ఆర్థిక సాయం అందించారు. ఇక్కడ కాంగ్రెస్‌ నాయకులు, తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

● రెండు ఇసుక టిప్పర్లు సీజ్‌

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్‌ చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. నిమ్మపల్లిలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో లిఫ్టపనులు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్‌ ఇక్కడ ఉన్న ఇసుకను టిప్పర్లలో సిద్దిపేటకు తరలిస్తున్నారు. బ్లూకోల్ట్స్‌ సిబ్బంది పట్టుకొని విచారించగా సరైన అనుమతి పత్రాలు లేకపోవడంతో రెండు టిప్పర్లను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ల యజమానులపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

● గల్ఫ్‌ ఏజెంట్లు మోసం చేస్తే ఫిర్యాదు చేయాలి

రుద్రంగి: నకిలీ గల్ఫ్‌ ఏజెంట్ల చేతిలో మోసపోతే ఫిర్యాదు చేయాలని ఎస్సై సిరిసిల్ల అశోక్‌ అన్నారు. సోమవారం మండలంలోని మానాలకు చెందిన కోలకాని రవిని అజర్‌ బైజాన్‌ దేశం పంపిస్తానని అడ్డబోర్‌ తండా గ్రామానికి చెందిన నకిలీ గల్ఫ్‌ ఏజెంట్‌ అజ్మీరా కిషన్‌ రూ.2.75 లక్షలు తీసుకొని వీసా ఇవ్వక, డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేయడంతో కేసు నమోదు చేశామన్నారు.

● బైక్‌ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వీర్నపల్లి: మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన అంకమల్ల రవి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అడవిపదిరకు పనినిమిత్తం వెళ్లగా అడవిపదిర బస్టాండ్‌ వద్ద బైక్‌ అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం 108లో సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు.

● చికిత్స పొందుతూ ఫీల్డ్‌ అసిస్టెంట్‌ మృతి

ముస్తాబాద్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ ఫీల్డ్‌ అసిస్టెంట్‌ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బందనకల్‌కు చెందిన సురభి నారాయణరావు, సురభి దంపతుల కుమారుడు రాజేశ్వర్‌రావు (46) ఫీల్డ్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గత జనవరి 10న బందనకల్‌ శివారులో రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు మొదట సిద్దిపేట ఆస్పత్రికి, అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఏడు నెలలకుపైగా చికిత్స పొందుతూ ఈ క్రమంలో సోమవారం మృతిచెందాడు. మాజీ సర్పంచులు జెల్ల వెంకటస్వామి, వెంకటేశ్వరి, ఏపీవో ఆనంద్‌, టీఏ రమేశ్‌ నివాళులు అర్పించారు.

● కల్వర్టు నిర్మాణానికి రూ.20వేలు అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని గిద్ద చెరువు, పార్కులకు వెళ్లేదారిలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు నిర్మాణానికి సింగిల్‌ విండో చైర్మన్‌ గుండారపు కృష్ణారెడ్డి రూ.20 వేలు అందించారు. కల్వర్టు తెగి ప్రమాదకరంగా మారడంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు, వాహనదారులు ఇబ్బంది పడుతునన్నారు. ఎంపీడీవో సత్తయ్య విజ్ఞప్తి మేరకు కృష్ణారెడ్డి ముందుకొచ్చి డబ్బులు అందజేశారు. దీంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎంపీడీవో సత్తయ్య, కార్యదర్శి ప్రవీణ్‌, నాయకులు నర్సింలు, పిల్లి కిషన్‌ జుబేర్‌, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీ నాయకుల నివాళి

సిరిసిల్లటౌన్‌: ప్రధాని మోడీ పిలుపుమేరకు బీజేపీ నాయకులు సోమవారం 'హర్‌ ఘర్‌ తిరంగా' కార్యక్రమాన్ని చేపట్టారు.పట్టణంలోని మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌, సుభాష్‌చంద్రబోస్‌, సర్దార్‌ వల్లాభాయ్‌ పటేల్‌ తదితర విగ్రహాలను శుద్ధిచేశారు. అనంతరం విగ్రహాలకు పూలమాలలు వేసి, అక్కడే జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా జాతీయ నేతలకు నివాళి అర్పించారు. బీజేపి హర్‌ఘర్‌ తిరంగా ఇన్‌చార్జి గరిపెల్లి ప్రభాకర్‌, కోఆర్డినేటర్‌ ఊరగొండ రాజు, కౌన్సిలర్‌ గూడూరి భాస్కర్‌, దాసరి శ్రీనివాస్‌, పాల్గొన్నారు.

● మానాలను నిజామాబాద్‌ జిల్లాలో చేర్చాలి

రుద్రంగి: ఉమ్మడి మానాల గ్రామాన్ని పూర్వం ఉన్న నిజామాబాద్‌ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలో చేర్చాలని ఉమ్మడి మానాల గ్రామ ప్రజలు డిమాండ్‌ చేశారు. సోమవారం మానాల గ్రామ పంచాయతీ ఎదుట సమావేశమయ్యారు. మానాలతో పాటు కొత్తగా ఏర్పడిన ఎనిమిది గిరిజన తండా గ్రామాలను కమ్మర్‌పల్లి మండలంలో చేర్చాలని, లేదంటే మానాలను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. ఉమ్మడి మానాల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

● కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

బోయినపల్లి: ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మధ్యాహ్న భోజనరంగం జిల్లా కారదర్శి గురజాల శ్రీధర్‌ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మిడ్‌డే మీల్స్‌ కార్మికులతో కలిసి ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ నెల 13న జిల్లావ్యాప్తంగా భోజన కార్మికుల ఒకరోజు ధర్నా విజయవంతం చేయాలన్నారు.

● రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌

ముస్తాబాద్‌: రౌడీషీటర్లు తమ జీవన విధానంలో మార్పు తెచ్చుకోవాలని ఎస్సై చిందం గణేశ్‌ అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం మంచిపనులు చేయాలన్నారు. తమపై ఉన్న రౌడీషీట్‌ను తొలగించుకునేలా సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. సివిల్‌ పంచాయతీల విషయాల్లో తలదూర్చొద్దన్నారు. అందరిపై పోలీస్‌ నిఘా ఉంటుందన్నారు.

● ఉపాధ్యాయుల నిరసన

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి మోడల్‌ స్కూల్‌ ఉపాధ్యాయులు సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ప్రతినెలా వేతనాలు ఒకటో తేదీన చెల్లించాలని, పదోన్నతులు కల్పించాలని చేయాలని కోరారు. చంద్రశేఖర్‌, కె.బాలరాజు, జి.అంజయ్య, ఎస్‌.ప్రభాకర్‌, ఏ.శివకుమార్‌ రెడ్డి పాల్గొన్నారు.



వీర్నపల్లి: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల, బాలికల వసతిగృహం వెనుకాల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో విష పురుగులు పాఠశాలలోకి వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే వసతి గృహం వెనుకాల పిచ్చి మొక్కలు తొలగించాలి. లేకపోతే పాములు, విషపురుగులతో విద్యార్థులకు ప్రమాదం పొంచివుంది.

– భూత వినోద్‌ కుమార్‌, వీర్నపల్లి

వాట్సప్‌ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్‌ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్‌ నంబర్‌ : 9440243048

గురుకులం సమస్యలు పరిష్కరించాలి



ఎల్లారెడ్డిపేట: దుమాలలోని ఏకలవ్య గురుకులంలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ యువమోర్చా నాయకులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు దుమాలలోని గురుకులం గేట్‌ ఎదుట బైఠాయించి, యువమోర్చా మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు కరువయ్యాయన్నారు. గురుకులం పరిసరాలు అధ్వానంగా మారాయని, టాయిలెట్స్‌ సరిగ్గా లేవన్నారు. యువమోర్చా ఉపాధ్యక్షుడు మార్పు దయాకర్‌రెడ్డి, మానుక బాలకిషన్‌, సోషల్‌మీడియా కన్వీనర్‌ నరేందర్‌, నాయకులు ఒరుగంటి చందు, మహేశ్‌, రోహిత్‌, నరేందర్‌, సంపత్‌, సంతోష్‌, ప్రశాంత్‌, శ్రీనివాస్‌, లక్ష్మణ్‌, ప్రభాస్‌, అక్షయ్‌ పాల్గొన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి సన్నిధిలో శ్రావణమాసం సంద్భంగా సోమవారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 6 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్‌ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్‌	0	1,680
భీమేశ్వర సదన్‌ ఏసీ	0	1,344
భీమేశ్వర సదన్‌ సూట్స్‌	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్‌	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్‌ ఏసీ	0	1,008
నందీశ్వర్‌ నాన్‌ఏసీ	0	560
నందీశ్వర సూట్స్‌	0	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌	0	448
పార్వతీపురం స్పెషల్‌	0	672
పార్వతీపురం సాధారణ	0	336

– వేములవాడ

వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పిస్తాం

సాక్షి స్పందన

సిరిసిల్ల ఎడ్యుకేషన్‌: జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తామని గురుకులాల సమన్వయ అధికారి తెలిపారు. 'గురుకులం గుబులు' అనే శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా వ్యాప్తంగా 8 సంక్షేమ గురుకుల కళాశాలలు ఉన్నాయని వాటిలో మూడింటికి మాత్రమే సొంతభవనాలు ఉన్నాయని తెలిపారు. విద్యాలయ ఆవరణలోకి విష పురుగులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ప్రధాన రహదారి వెంట ఉన్న గురుకులాల్లో గేట్‌ కీపర్‌ విధిగా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాశ్వత భవనాలు ఏర్పాటుకు ఉన్నత స్థాయి అధికారులకు విన్నవిస్తామన్నారు.

విద్యా వలంటీర్లను నియమించాలి



బోయినపల్లి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల తర్వాత చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని, విద్యార్థులు నష్టపోకుండా ఉండేందకు విద్యా వలంటీర్లను నియమించాలని తపస్‌ రాష్ట్ర కార్యదర్శి ఒడ్నాల జగన్‌మోహన్‌ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్‌) సభ్యత్వ నమోదు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నిర్వహించారు. తపస్‌ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్‌ మాట్లాడుతూ పెండింగ్‌ డీఏలు విడుదల చేసి, పీఆర్సీ కల్పించాలన్నారు. కేజీబీవీల్లో సీఆర్టీలను రెగ్యులర్‌ చేసి, మినిమం స్కేల్‌ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో రవికుమార్‌, నరేందర్‌, కనుకయ్య, తిరుపతి, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపుపై కళా ప్రదర్శన



సిరిసిల్లటౌన్‌: రవాణా వాహనాలు త్రైమాసిక ఫీజులు, ట్యాక్సీల బకాయిల చెల్లింపుపై తెలంగాణ సాంస్కృతిక కళా బృందం సోమవారం కళా ప్రదర్శన నిర్వహించారు. సిరిసిల్లలోని కార్మికవాడలు, ముఖ్య కూడళ్లలో ఆటపాటలతో ప్రజలు బకాయిలు వెంటనే చెల్లించాలని అవగాహన కల్పించారు. బృందం అధ్యక్షుడు ఎడ్మల శ్రీధర్‌రెడ్డి, కళాకారులు శ్రీరాముల రామచంద్రం, గడ్డం శ్రీనివాస్‌, గుగ్గిళ్ల పర్శరాములు, వంతడ్పుల గణేశ్‌ తదితరులున్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

• ఆలస్యంగా వెలుగులోకి

వేములవాడఅర్బన్‌: వేములవాడ పట్టణంలోని ఓ ప్రైవేట్‌ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సుంకెపాక సాత్విక్‌ అనే విద్యార్థిని ఉపాధ్యాయుడు నేరెడు ఆంజనేయులు చితకబాదినట్లు విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమ కుమారుడిని ఎందుకు కొట్టారో చెప్పాలని విద్యార్థి తలిదండ్రులు ప్రశ్నించగా పాఠశాల యాజమాన్యంతో పాటు సదరు ఉపాధ్యాయుడు నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని వారు వాపోయారు. కాగా పాఠశాల యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్‌ చేశారు. ఈ విషయంపై డీఈవో రమేశ్‌కు ఫిర్యాదు చేశామన్నారు. వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి తల్లి ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్‌ సీఐ శ్రీనివాస్‌ తెలిపారు.

● స్పోర్ట్స్‌ క్లబ్‌ అధ్యక్షుడిగా రాజు

ఇల్లంతకుంట: మండల స్పోర్ట్స్‌ క్లబ్‌ అధ్యక్షుడిగా మామిడి రాజు సోమవారం ఎన్నికయ్యారు. అనంతరం రాజును సంఘ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్‌ సభ్యులు ఉప్పల అమరేందర్‌, కార్తీక్‌, బాలరాజు, నాగపురి రవి, చిట్టి ప్రదీప్‌ రెడ్డి, త దితరులు పాల్గొన్నారు.